క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా...



నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర ఐటీ వింగ్ అధ్యక్షుడు పోశంరెడ్డి సునీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొప్పోలు వెంకటేశ్వర్లు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వారి వెంట రాష్ట్ర వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధికార ప్రతినిధి జీవీ ప్రసాద్ ఉన్నారు.

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వినతి



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌కు ప్రజాసత్తా జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు బుధవారం కలిశారు. 2024 ఎన్నికల్లో భాగంగా ఎన్నికలపై అవగాహన సదస్సులు, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు, ఓటర్లతో ముఖాముఖి, సమస్యాత్మక ప్రాంతాల్లో నాయకులు, ప్రజలకు కౌన్సిలింగ్ నిర్వహించాలని, ప్రశాంత ఎన్నికలకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

జేసీకి రైతు సంఘాల నాయకుల వినతి



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు ఏపీ రైతు సంఘాల సమాఖ్య నాయకులు బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల సమాఖ్య రాష్ట్రాధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొదటి పంట కోతలు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. 60 శాతానికిపైగా కోతలు పూర్తయ్యాయని చెప్పారు. వరికోతల ప్రారంభంలో దాదాపు అన్ని రకాల ధాన్యాన్ని పుట్టి రూ.24 వేల నుంచి రూ.24,500 వరకు కొనుగోలు చేశారని తెలిపారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాల వ్యాపారులు, మిల్లర్లు వచ్చి ధాన్యం కొనుగోలు చేశారని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలుతో అధికారుల తనిఖీలతో జిల్లాతో పాటు ఇతర జిల్లాల వ్యాపారులు కొనుగోళ్లకు ముందుకు రాక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విన్నవించారు. తగిన చర్యలు చేపట్టి జిల్లా రైతాంగానికి మద్దతు ధరలు అందేలా చూడాలని కోరారు.

ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవం



నెల్లూరు(బృందావనం): ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో నర్తకి సెంటర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా రంగస్థల కళాకారుడిగా పేరు ప్రతిష్టలు గడించిన సీనియర్ కళాకారుడు మహేష్‌ను ఘనంగా సన్మానించారు. రంగస్థల ప్రతిష్టను కళాకారులెందరో తమ నాటకాల ద్వారా పెంచి నాటకరంగానికి చేసిన కృషిని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ప్రస్తావించారు. బుల్లితెర నటుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావు, జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు జయప్రకాష్ వివిధ సంస్థలకు చెందిన నిర్వాహకులు బాలాజీ, లక్ష్మీపతి, రఘు, రాము, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

విడవలూరు : ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని స్వీప్ నోడల్ ఆఫీసర్ పీవీ రత్నం అన్నారు. స్థానిక పీఆర్‌ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు ఆవశ్యకతపై బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఓటును తప్పకుండా వినియోగించుకోవాలని, ఇంకా ఎవరైనా ఓటు నమోదు చేసుకోకుంటే వెంటనే చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు ఎస్.రవిశంకర్‌రెడ్డి, కె.హరి, సీఆర్పీ మల్లేశ్వర్‌రెడ్డి, సీసీ రాజశేఖర్, కళాశాల అధ్యాపకులు పి.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహస్వామి, వేణుగోపాలుడి తెప్పోత్సవం

కనులపండువగా తెప్పోత్సవం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని వేణుగోపాలస్వామి మందిరం ప్రాంగణంలోని కోనేరులో వేదగిరి లక్ష్మీనృసింహస్వామి, వేణుగోపాలస్వామి తెప్పోత్సవాన్ని బుధవారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామికి కల్యాణోత్సవం అనంతరం సోదరుడైన వేదగిరి లక్ష్మీనృసింహస్వామి ఉభయదేవేరులు లక్ష్మీదేవి, చెంచులక్ష్మి సమేతంగా విచ్చేసి పట్టువస్త్రాలు సమర్పించడం సంప్రదాయం. అనంతరం చోటు చేసుకునే పరిణామాల నేపథ్యంలో లక్ష్మీనృసింహస్వామి అలకబూని మరో సోదరుడైన మూలాపేటలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి చెంతకు వెళ్లడం.. సోదరుడి అలకను తీర్చి శాంతింపజేసేందుకు వేణుగోపాలుడు పుష్కరిణిలో విహరింపజేయడం ఆనవాయితీ. అందులో భాగంగా లక్ష్మీదేవి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనృసింహస్వామి, రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాలస్వామిని విశేషంగా అలంకరించిన తెప్పపై కొలువుదీర్చి నేత్రపర్వంగా ఉత్సవం నిర్వహించారు. ఈ తెప్పోత్సవానికి వేదగిరి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నుంచి ఉభయకర్తలుగా కొండేడి సుబ్బారెడ్డి కుమారులు, వేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించి ఉభయకర్తలుగా దిలీప్‌రెడ్డి వ్యవహరించారు. వేణుగోపాలస్వామి ఆలయ ఈఓ విరుపావఝుల గిరికృష్ణ, వంశపారంపర్య ధర్మకర్త మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, తదితరులు తెప్పోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక



పార్టీలో చేరిన టీడీపీ కార్యకర్తలతో ఆదాల

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడారు. వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులైన టీడీపీ యువ కార్యకర్తలు స్వచ్ఛందంగా వచ్చి తమ పార్టీలో చేరడం శుభపరిణామమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎటువంటి సమస్య వచ్చిన పార్టీతో పాటు తాను అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో మూడో మైలు, నాలుగో మైలు నారాయణరెడ్డిపేట, మాగుంట లే ఔట్ కొత్తకాలువ, అల్లీపురం ప్రాంతాలకు చెందిన ఆర్కాట్ సుమన్, సతీష్ రమేష్, షకీల్, ఆమెన్ సైఫ్, కిరణ్, వెంకటేశ్వర్లు, చంటి తదితరులతో పాటు మరో 25 మంది ఉన్నారు. మినీబైపాస్‌లోని ఆదాల కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ పొట్లూరి స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి, ఏఎంసీ చైర్మన్ పేర్నాటి కోటేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, దువ్వూరు సుజిత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ కబ్జాలపై సమాధానం చెప్పాలి



మాట్లాడుతున్న మల్లి నిర్మల

నెల్లూరు (దర్గామిట్ట): కనుపర్తిపాడు రెవెన్యూ పరిధిలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కాలువలను ఆక్రమించి కల్యాణ మండపాన్ని నిర్మించారని ఆ గ్రామ రైతులు ఆరోపిస్తున్నారని, ఆయన నిర్మించిన ఇళ్లు, ట్రస్టు కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయో అధికారులకు చెప్పాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధికార ప్రతినిధి మల్లి నిర్మల డిమాండ్ చేశారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు నేరుగా వెళ్లగలిగే తమ నాయకుడు విజయసాయిరెడ్డిపై కొందరు అర్థరహిత విమర్శలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచి పచ్చకండువా కప్పుకున్న కొందరు తమ నాయకుడు విజయసాయిరెడ్డిని రాజ్యసభకు రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సిగ్గుచేటు అన్నారు. వారు కనుపర్తిపాడు భూదందాపై ప్రజలకు సమాధానం చెప్పి ఎన్నికలకు పోవాలని సవాల్ విసిరారు. గతంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి కనుపర్తిపాడు చెరువు పోరంబోకు, ఫారెస్ట్, ఉమ్మడి రైతుల భూములపై న్యాయస్థానాలకు తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. కనుపర్తిపాడు చెరువుకు సంబంధించిన 30 ఎకరాల ఆక్రమణ, రూరల్ పరిధిలోని 355 ఎకరాల ఆక్రమణపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి రైతుల కన్నీళ్లు తుడవాలన్నారు. విజయసాయిరెడ్డి వీఆర్ కళాశాలలో విద్యాభ్యాసంపై ఆనం వెంకటరామిరెడ్డి వ్యాఖ్యలు వికృతంగా ఉన్నాయన్నారు. తమ నాయకుడు విజయసాయిరెడ్డి పేదల పక్షాన నిలబడి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు గతంలోని ఆస్తులు, ప్రస్తుత ఆస్తుల వివరాలను ప్రజలకు చెప్పి ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. తమ నాయకుడు విజయసాయిరెడ్డి రాకతో ప్రభుత్వ భూముల ఆక్రమణదారులు భయభ్రాంతులకు గురవుతునారన్నారు. తమ నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజారంజక పాలనతో జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు.

భక్తజన సేవలో దాతలు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలో బుధవారం జరిగిన రంగనాథస్వామి రథోత్సవానికి తరలివచ్చిన అశేష భక్త జనానికి పలువురు దాతలు సేవలందించారు. మానవ సేవే మాధవ సేవగా భావించి భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ, నీరుతో పాటు అన్నదానం పంపిణీ చేసి తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. నాలుగు కాళ్ల మండపం వద్ద సంతపేట శ్రీకాళారెడ్డి సత్రం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణతో పాటు మినరల్ వాటర్, మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ ఈఓ జీ దర్గయ్య, సత్రం ఇన్‌చార్జి బీ మహేష్, దేవాదయ శాఖ అధికారులు పర్యవేక్షించారు. శ్రీరంగనాథ భక్త మండలి, శ్రీరాజరాజేశ్వరి భక్త మండలి ఆధ్వర్యంలో మెంటా చలమయ్య జ్ఞాపకార్థంగా అన్నప్రసాద వితరణ చేశారు. గత 36 ఏళ్లుగా సేవా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు నిర్వాహకులు మెంటా రామమోహన్‌రావు తెలిపారు. ది నెల్లూరు డిస్ట్రిక్ట్ రైస్ కాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, కార్యదర్శి రాజా రవి, తదితరుల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. గ గోమతి నగర్‌లోని శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు.



ది నెల్లూరు డిస్ట్రిక్ట్ రైస్ కాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...



కాళారెడ్డి సత్రం వద్ద అన్నప్రసాద వితరణ



శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో....

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని హరనాథపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మురళీకృష్ణ, గోమతినగర్ విద్యుత్ ఫీడర్లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. హరనాథపురంలోని అన్ని వీధులు, గోమతినగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారకు. వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆరోగ్యంపై అవగాహనకు కళా ప్రదర్శనలు



నెల్లూరు(అర్బన్): ప్రజారోగ్యవేదిక ఆధ్వర్యంలో సాంస్కృతిక కళారూపాల ద్వారా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆ వేదిక రాష్ట్రాధ్యక్షుడు డాక్టర్ ఎంవీ రమణయ్య తెలిపారు. ఇందుకు సంబంధించి నగరంలోని రామచంద్రారెడ్డి ఆస్పత్రిలో ప్రజాకళాకారుల నాయకులతో బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వైద్యం ఖరీదుగా మారిపోవడం బాధాకరమన్నారు. ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎక్కువ శాతం జబ్బులు రావన్నారు. ప్రాథమిక వైద్యంతోనే ఎక్కువ శాతం జబ్బుల నుంచి కోలుకోవచ్చన్నారు. ప్రతి అనారోగ్య సమస్యకు స్పెషలిస్టు డాక్టర్లు అవసరం లేదన్నారు. అందువల్లనే ఆరోగ్యంపై సాంస్కృతిక రంగాన్ని సాధనంగా చేసుకుని జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కళాప్రదర్శనలు ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు విజయకుమార్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

355 మంది సిబ్బందితో పారిశుధ్య పనులు



దేవస్థానం వద్ద పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంహెచ్ఓ వెంకటరమణ

నెల్లూరు(బారకాసు): రథోత్సవం సందర్భంగా రంగనాయకులపేటలోని రంగనాథస్వామి దేవస్థానం వద్ద పారిశుధ్య పనులను శానిటేషన్ అధికారులతో కలిసి మున్సిపల్ హెల్త్‌ఆఫీసర్ వెంకటరమణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రథోత్సవానికి పెద్ద సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశాల మేరకు నలుగురు శానిటేషన్ సూపర్‌వైజర్లు, 18 మంది శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, 33 మంది మేస్త్రీలు, 300 మంది పారిశుధ్య కార్మికులతో రెండు షిఫ్టులలో ప్రణాళికాబద్ధంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

● వైభవంగా పొన్న వాహనసేవ



రంగనాయకులపేటలో కొలువైన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి పొన్న వాహన సేవను వైభవంగా నిర్వహించారు. శ్రీవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి పొన్న వాహనంపై కొలువుదీర్చి ఉత్సవం జరిపారు. ఉభయకర్తలుగా సిద్దవరపు రామలింగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుమంత్‌కుమార్‌రెడ్డి వ్యవహరించారు.

–నెల్లూరు(బృందావనం)

ఆదాలకు యాదవ సోదరుల మద్దతు



ఆదాలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యాదవ సోదరులు

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి రూరల్ నియోజకవర్గంలోని యాదవ సోదరులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. 26వ డివిజన్ త్యాగరాజనగర్‌లో విశ్రాంత ఏడీ శ్రీహరియాదవ్ ఆధ్వర్యంలో యాదవుల ఆత్మీయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆదాలకు యాదవ సోదరులు సంపూర్ణ మద్దతును తెలిపారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తమ సామాజిక వర్గం అంతా కలిసికట్టుగా ఆదాల గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఈ ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సీహెచ్ హరిబాబు యాదవ్, రాచర్ల రవికుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ మల్లిబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, ఉడత వెంకటరావుయాదవ్, యాదవ సంక్షేమ, యాదవ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూంకు పటిష్ట ఏర్పాట్లు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట జేసీ సేతు మాధవన్, కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, అదనపు ఎస్పీ సౌజన్య, జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, రెవెన్యూ డివిజనల్ అధికారి మలోల, రెవెన్యూ, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలి

2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు లోనవకుండా ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్లను కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు నగదు, విలువైన వస్తువులు అందజేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ దివ్యప్రత్యూష పాల్గొన్నారు.

నిబంధనల మేరకే మద్యం విక్రయాలు

- జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి




నాగమల్లేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో ఎన్నికల నియమ, నిబంధనలకు లోబడి మద్యం విక్రయాలు చేపట్టాలని, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కే నాగమల్లేశ్వరరెడ్డి జీఆర్వో సిబ్బంది, బార్ యాజమాన్యాలను హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలను ఆయన బుధవారం 'సాక్షి'కి వెల్లడించారు. ఎన్నికల్లో రాజకీయపార్టీలు మద్యంతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉందన్నారు. దీనిని పూర్తిస్థాయిలో కట్టడిచేసేందుకు పక్కాప్రణాళికలతో ముందుకెళుతున్నామన్నారు. జిల్లాలోని 193 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 53 బార్ అండ్ రెస్టారెంట్ల యాజమాన్యాలతో ఇటీవల సమావేశం నిర్వహించి ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన నియమ, నిబంధనలను వివరించామన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు సమయపాలన విధిగా పాటించాలన్నారు. దొడ్డిదారిన విక్రయాలు సాగిస్తే చర్యలు తప్పవన్నారు.

గతేడాది వలే..

ఈ నెల 16న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఐఎంఎల్ డిపోలో ప్రభుత్వ, బార్ అండ్ రెస్టారెంట్లకు గతేడాది మార్చి 16 నుంచి 31వ తేదీ వరకు, ఏప్రిల్, మే నెలల్లో ఎన్ని కేసుల మద్యం, బీర్లు సరఫరా చేశామో అదే దామాషా ప్రకారం ఈ ఏడాది అందజేస్తున్నామని తెలిపారు. ఒక్క సీసా కూడా అదనంగా ఇచ్చేది లేదన్నారు. గతేడాది మార్చి 16 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని బార్ అండ్ రెస్టారెంట్లకు 75,324 మద్యం కేసులు, 22,232 బీర్ కేసులను సరఫరా చేశామని తెలిపారు. ఈఏడాది సైతం అంతే మొత్తంలో మద్యాన్ని సరఫరా చేశామని చెప్పారు. ప్రతిరోజూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో స్టాక్ వెరిఫికేషన్ నిర్వహిస్తామన్నారు. అందుకు సంబంధించిన నివేదికను ఎప్పటికప్పుడు ఎన్నికల సెల్‌తో పాటు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. మద్యం దుకాణాల సిబ్బంది, బార్ల యాజమాన్యాలు ఎన్నికల నియమ, నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు.

మహిళ దారుణహత్య



మస్తానమ్మ (ఫైల్)



హత్యకు గురైన మస్తానమ్మ

నెల్లూరు సిటీ: ఓ మహిళను గొంతుకోసి కిరాతకంగా హత్య చేసిన ఘటన మూడో మైలులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..నగరంలోని కిసాన్‌నగర్‌లోని, వేణుగోపాల్‌నగర్‌లో నాగూర్ ఆదిశేషయ్య, మస్తానమ్మ(48) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు వెంకటేష్, కుమార్తెలు సునీత, దివ్యలు ఉన్నారు. పెద్ద కుమార్తె సునీతను కొన్నేళ్ల క్రితం సురేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. వ్యక్తిగత కారణాలతో ఇద్దరూ విడిపోయి విడివిడిగా ఉంటున్నారు. ఈ క్రమంలో సునీతకు కిసాన్‌నగర్‌కు చెందిన నెల్లూరు చంటి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇటీవల ఇద్దరి మధ్య గొడవ జరగడంతో మాట్లాడుకోవడం లేదు. ఈ నేపథ్యంలో రెండ్రోజుల క్రితం సునీత తన ఇద్దరు కుమారులతో కలిసి మూడోమైలు, విజ్ఞేశ్వరనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని సత్యనారాయణపురం నుంచి అక్కడికి మారారు. ఈ క్రమంలో చంటి తన కారులో మస్తానమ్మను తీసుకుని సునీత ఇంటికి వచ్చాడు. అక్కడ వారి మధ్యన ఏమి జరిగిందో ఏమో కానీ మస్తానమ్మను కిరాతకంగా గొంతుకోసి హత్య చేశారు. అనంతరం చంటి, సునీత అక్కడి నుంచి పారిపోయారు. స్థానికులు గమనించి లోపలికి వెళ్లిచూడగా మస్తానమ్మ బెడ్‌రూమ్‌లో రక్తపుమడుగులో నిస్తేజంగా పడి కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ మారుతీకృష్ణ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.